క్లుప్తంగా

మినీ గురుకులంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని ఎస్టీ బాలికల మినీ గురుకుల పాఠశాలలో పీహెచ్‌సీ వైద్యులు విద్యార్థినులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. బుధవారం మండల వైద్యాధికారి శ్రీకాంత్, డాక్టర్ ఫెర్నాజ్ విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. హెచ్‌బీ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

వరి కొయ్యలను కాల్చొద్దు

చిన్నశంకరంపేట(మెదక్): పంట పొలాల్లోని వరి కొయ్యలను కాల్చొద్దని రామాయంపేట ఏడీఏ రాజ్‌నారాయణ సూచించారు. బుధవారం నార్సింగి మండలంలోని శేరిపల్లిలో ఆయన మాట్లాడుతూ.. రైతులు పంట పొలాల్లో వరి కొయ్యలను కాల్చడంతో పంట పొలాల్లోని భూ పోషణ విలువలు తగ్గిపోతాయన్నారు. పంట వ్యర్థాలను దుక్కిలో దున్ని వేయడం ద్వారా పోషకాలు పెరుగుతాయన్నారు. దుక్కిలో దున్నివేయడంతో భూసారం పెరిగి పంటల సాగుకు ఉపయోగపడుందన్నారు. ఏఓ యాదగిరి ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

చిన్నశంకరంపేట(మెదక్): కస్తూర్బా పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే ఉద్యోగ భద్రత కల్పించాలని కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం చిన్నశంకరంపేట కస్తూర్బా పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ కేజీబీవీ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ నాగరాణి ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఆరోగ్య బీమా కల్పించి, న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాణి, మంజుల, పారిజాత, శ్రీదేవి, రజిత, కవిత, థేరిసా, ప్రిన్సిపాల్ శ్రీదేవి పాల్గొన్నారు.

సైబర్ మోసాలతో జాగ్రత్త

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు, యువకులు సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ నర్సింహులు అన్నారు. మండల కేంద్రం చిలప్‌చెడ్ గ్రామస్తులకు బుధవారం ఆయన సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు అడిగితే చెప్పొద్దని సూచించారు. బ్యాంకు అధికారులు అలాంటి వివరాల కోసం ఎలాంటి ఫోన్‌కాల్స్ చేయరని తెలిపారు. యువత ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ అనవసర లింక్స్ క్లిక్ చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌శాఖ సిబ్బంది, గ్రామస్తులు

ఎల్లాపూర్‌లో వైద్య శిబిరం

నర్సాపూర్ రూరల్: మండలంలోని ఎల్లాపూర్‌లో జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా విష్ణు ఫార్మా కళాశాల, రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని ఎల్లాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి ఎల్లాపూర్‌తో పాటు పరిసర గ్రామాల వైద్యం వైద్య శిబిరంలో పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు అచ్యుత్, యశస్వి, హరీశ్‌కుమార్, విష్ణు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్, హెచ్‌ఓడీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ..

మండలంలోని చిప్పల్‌తుర్తి కేజీబీవీలో రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ సజన, వైద్యులు ఫౌజియ, కృష్ణ కుమార్, పద్మావతి, సాహిత్య పాల్గొని విద్యార్థులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు.

నిధులు మంజూరు

రామాయంపేట(మెదక్): మండల పరిధిలో గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం మైనంపల్లి హన్మంతరావు నిధులు మంజూరు చేశారని కాంగ్రెస్ జిల్లా నాయకుడు హన్మంతరావు తెలిపారు.

ట్రిపుల్‌ఆర్ భూముల రీసర్వే

శివ్వంపేట(నర్సాపూర్): ట్రిపుల్‌ఆర్ రోడ్డులో భూములు కోల్పోతున్న అసలైన రైతులను గుర్తించేందుకు రెవెన్యూ సిబ్బంది మండల పరిధిలోని లింగోజిగూడలో బుధవారం సర్వే చేశారు. పలువురు రైతుల భూముల నమోదులో వ్యత్యాసం ఉండడంతో అసలైన రైతులకు న్యాయం చేయాలని ఆర్‌డీఓ మైపాల్‌ని కోరడంతో రెవెన్యూ సిబ్బంది భూముల సర్వే ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. అనంతరం అసలైన పట్టాదారు రైతులకు న్యాయం చేస్తామని ఆర్‌ఐలు కిషన్, సునీల్ తెలిపారు.



లింగోజిగూడలో సర్వే చేస్తున్న సిబ్బంది

మెనూ కచ్చితంగా పాటించాల్సిందే..



అల్లాదుర్గం(మెదక్): హాస్టల్‌లో కూరగాయలను పరిశీలిస్తున్న అధికారులు



పెద్దశంకరంపేట(మెదక్): కస్తుర్బా విద్యాలయంలో భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు



నర్సాపూర్ రూరల్: కేజీబీవీ వంటగదిని పరిశీలిస్తున్న అధికారులు

తహసీల్దార్ తులసీరాం

టేక్మాల్(మెదక్): పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని తహసీల్దార్ తులసీరాం తెలిపారు. బుధవారం మండలంలోని సాలోజిపల్లి ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పలు రికార్డులను, పరిశీలించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్, ఏఈ గోపాల్, హెచ్‌ఎం సహదేవ్, సీఆర్‌పీ శివరాజ్, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, డీలర్ సామెల్ పాల్గొన్నారు.

పరిశుభ్రమైన వాతావరణంలో వండాలి

కొల్చారం(నర్సాపూర్): విద్యార్థులకు అందించే ఆహారాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యతతో అందించాలని నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను ఆర్డీవో తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ గఫార్ మియా, ఎంపీడీఓ కష్ణవేణి, డిప్యూటీ తహసీల్దార్ నాగవర్దన్, ఆర్‌ఐ ప్రభాకర్ ఉన్నారు.

హాస్టళ్ల తనిఖీ

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రం అల్లాదుర్గంలోని కస్తూర్బా బాలికల విద్యాలయం, బీసీ బాలికల, ఎస్సీ బాయ్స్ హాస్టళ్లను మండల స్పెషల్ ఆఫీసర్ కరుణాకర్ సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, మండల సూపరింటెండెంట్ శంకర్, ఎంపీఓ లింగప్ప, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

హవేళీఘణాపూర్(మెదక్): పరిశుభ్రత పాటిస్తూ నాణ్యమైన భోజనం వడ్డించాలని మెదక్ ఎంఈఓ నీలకంఠం అన్నారు. మండల వనరుల కేంద్రంలో ఆయా గ్రామాలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

అర్థమయ్యేలా బోధించాలి

రేగోడ్(మెదక్): విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని మెదక్ ఆర్డీఓ రమాదేవి సూచించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేశ్, ఆర్‌ఐ ఫెరోజ్ సిబ్బంది ఉన్నారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట(మెదక్): పేటలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం, బీసీ బాలుర సంక్షేమ వసతి గృహం, పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మండల ప్రత్యేక అధికారి సర్దార్ సింగ్ తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ, ఎంపీడీఓ రఫిఖ్ ఉన్నిసా, ఎంఈఓ వెంకటేశం ఉన్నారు.

పాఠశాలల పరిశీలన

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు పాఠశాలలను మండల ప్రత్యేక అధికారి స్వరూప బుధవారం పరిశీలించారు. మోడల్ పాఠశాల గిరిజన స్పోర్ట్స్ గురుకుల పాఠశాలలో వంటశాలలతో పాటు స్టోర్‌రూంలను పరిశీలించారు. పరిశీలనలో ఎంఈఓ నీరజ, ఎంపీడీఓ చిన్నారెడ్డి ఉన్నారు.

కేజీబీవీ పాఠశాలలో..

నర్సాపూర్ రూరల్: కేజీబీవీ పాఠశాలలో వంటగదిలో పరిశీలించి ఆహారాన్ని పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.

మిర్జాపల్లితండాలో..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను మండల అధికారులు తనిఖీ నిర్వహించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను ఎంపీడీఓ దామోదర్ తనిఖీ చేయగా, మిర్జాపల్లిలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తహసీల్దార్ మన్నన్ పరిశీలించారు. ఎంఈఓ పుష్పవేణి, ఆర్‌ఐ రాజు తనిఖీల్లో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ అశోక్‌గౌడ్, చిత్రంలో అధికారులు, కౌన్సిలర్లు

ఏకపక్షంగా కేటాయిస్తే ఎలా?

మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన కౌన్సిలర్లు

నర్సాపూర్: ప్రభుత్వం నుంచి మున్సిపాలిటీకి వచ్చిన ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులను ఏకపక్షంగా ఎలా కేటాయిస్తారని మున్సిపల్ కౌన్సిలర్లు ప్రశ్నించారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సమావేశంలో కౌన్సిలర్లు బుచ్చేష్‌యాదవ్, సురేశ్, రాజేందర్, యాదగిరి తదితరులు మాట్లాడుతూ.. గత వర్షాకాలంలో కురిసిన అకాల వర్షాలకు రోడ్లు పాడైనందున వాటి మరమ్మతులకు ప్రభుత్వం మున్సిపాలిటీకి రూ.17లక్షలు మంజూరు చేయగా, వాటిని అవసరం లేనిచోట కేటాయించి పనులు చేశారన్నారు. నిధులు సక్రమంగా ఖర్చు చేయలేదని, నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని కౌన్సిలర్లు హెచ్చరించారు. చైర్మన్ స్పందిస్తూ నిధులు రాగానే మున్సిపల్ సిబ్బంది పట్టణంలో పలు పనులు చేపట్టారని, తాను మరిన్ని నిధులు మంజూరు చేయించి పట్టణమంతట పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పట్టణంలోని బస్తీ దవాఖానాల్లో కనీస వసతులు లేవని కౌన్సిలర్లు సురేశ్, రాజేందర్, బుచ్చేష్‌యాదవ్ తదితరులు ప్రస్తావిస్తూ వాటిలో మహిళా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని, వారికి కనీస వసతులు లేనందున చాలా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. పట్టణ పరిధిలో ఉన్న మెదక్ హైదరాబాద్ జాతీయ రహదారిపై నిర్మించిన ఫుట్‌పాత్‌లను, రోడ్డును ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసిన వాటిని తొలగించాలని కౌన్సిలర్లు తీర్మానించారు. పట్టణంలో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, వీధి దీపాలు అంతటా వెలిగేలా చూడాలని కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బందికి సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావు, మేనేజర్ మధుసూదన్, వైస్ చైర్మన్ నయీమోద్దీన్, కౌన్సిలర్లు సురేశ్, బుచ్చేష్ యాదవ్, రాజేందర్, ఇశ్రత్‌సిద్దీఖా, యాదగిరి, రుక్కమ్మ, రాంచందర్, లలిత, సునీత, లక్ష్మి, సరిత పాల్గొన్నారు.

దుకాణాలు తొలగించాలి

మున్సిపల్ సమావేశం అనంతరం కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్, ఇతర సిబ్బందిని తమతో తీసుకెళ్లి జాతీయ రహదారిపై నిర్మించిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను చూపి, వాటిని తొలగించాలని కోరారు. ఈ సందర్భంగా ఫుట్‌పాత్‌లపై పెట్టిన దుకాణాలు తొలగించాలని అధికారులు వ్యాపారులకు సూచించారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థులు



శీలాంపల్లిలో మట్టిని సేకరిస్తున్న విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): భూసారానికి తగ్గ పంటలను సాగు చేసుకోవాని మల్లారెడ్డి యూనివర్సిటీ వ్యవసాయ విద్యార్థులు అన్నారు. బుధవారం వారు మండల పరిధిలోని శీలాంపల్లి గ్రామంలో గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం తునికి శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో భూసార పరీక్షల కోసం మట్టిని సేకరించే పద్ధతిని రైతులకు చేసి చూయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతు తన పొలంలో త్రిభుజకారంలో 15–20 సెం.మీ గుంత తీసి ఒక పక్కగా, ఎకరాలో 8–10 చోట్ల మట్టిని సేకరించాలి. సేకరించిన మట్టిలో రాళ్లు, పంట వేర్లు లేకుండా చూసుకొని నీడలో ఆరనివ్వాలి. మట్టి నమూనా కోసం పరికరాలు శుభ్రమైనవి వాడాలి. ఎలాంటి రసాయనాలు వాడకుండా మట్టిని సేకరించాలి. భూసార పరీక్షకు తడిసిన మట్టిని వాడరాదు. సేకరించిన మట్టిని వెంటనే ల్యాబ్‌కు పంపించాలి. ఆలస్యమైతే ఫలితాల్లో మార్పు రావచ్చన్నారు. వచ్చిన ఫలితాల ఆధారంగా నేల స్థాయిని బట్టి పంటలను సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు శమభాను, సాయిప్రసన్న, రమ్య, అభినయ, రోహిత, రైతులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

నర్సాపూర్: కార్తిక మాసం పురస్కరించుకొని శివాలయంలో రోజూ ప్రత్యేక పూజలు చేస్తున్నామని ఆలయ అర్చకుడు వీరప్ప గురూజీ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధవారం ఆలయంలో శివలింగాన్ని అన్నపూర్ణ దేవిగా అలంకరించి అన్నపూజ చేశామని చెప్పారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశామని వివరించారు.

డేటా ఎంట్రీ త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆనంద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీని త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. బుధవారం ఆయన చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి తప్పొప్పులు లేకుండా డేటా ఎంట్రీ త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామ ప్రత్యేకాధికారులతో కలిసి అంగన్‌వాడీ, పాఠశాలలో కొనసాగుతున్న భోజన పరిస్థితులను పర్యవేక్షించాలి. త్వరలో జరగనున్న ఉపాధిహామీ ఆడిట్‌కు రికార్డులు సిద్ధం చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు ఎలాంటి లోటు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్యామ్ ఉన్నారు.

విద్యతో పాటు క్రమశిక్షణ ముఖ్యం



విద్యార్థులతో స్వామి మాధవానంద సరస్వతి

మాధవానంద సరస్వతి

పాపన్నపేట(మెదక్): విద్యార్థులకు విద్యతో పాటు సంస్కారం నేర్పాలని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి అన్నారు. పాపన్నపేట జూనియర్ కళాశాల విద్యార్థులు టేక్మాల్ మండల కొప్పోల్ ఉమా సంగమేశ్వర ఆలయం వద్ద నిర్వహించిన కార్తీక వనభోజనాలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ విద్యార్థులపైనే ఆధారపడి ఉందన్నారు. విద్యార్థులకు విద్య, విజ్ఞానం, సంస్కారం, క్రమశిక్షణ నేర్పాలని సూచించారు. సమాజంలో గౌరవంగా బతికి తల్లిదండ్రులకు, గురువులకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. మానసిక ఉల్లాసం కోసం నిర్వహించిన క్రీడల్లో విజేతలకు ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. పాపన్నపేట, టేక్మాల్, శంకరంపేట ప్రిన్సిపాళ్లు నర్సింలు, సుభాష్ చంద్ర, శోభారాణి, అధ్యాపకులు సంతోష్, ప్రవీణ్‌కుమార్, సంధ్యారాణి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయంలో వైభవంగా సుదర్శన హోమం



హవేళీఘణాపూర్(మెదక్): చండీయాగంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి దంపతులు



శివ్వంపేట(నర్సాపూర్): సుదర్శన హోమం నిర్వహిస్తున్న పండితులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం సుదర్శన హోమం చేశారు. కార్తీకమాసం చిత్త నక్షత్రం సందర్భంగా ఆలయ పండితులు గుట్టపై వెలసిన స్వయంబు లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సుదర్శన హోమం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ శశిధర్‌గుప్తా, ప్రధాన అర్చకులు ధనుంజయ్‌శర్మ, అర్చకులు విద్యాకర్‌చారి, నర్సింహచార్యులు, మధుబాబు, పవన్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీయాగం

హవేళీఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని కూచన్‌పల్లి వ్యవసాయ క్షేత్రంలో ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి దంపతులు చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య చండీయాగం కొనసాగింది. కార్యక్రమానికి ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రైతు సభకు తరలిరండి : ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్న రైతు విజయోత్సవాలను విజయవంతం చేయాలని మెదక్ జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కొత్తపల్లిలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రైతు సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద పీఠ వేస్తున్నాడని చెప్పారు. ఈ క్రమంలో మొదటి బడ్జెట్‌లోనే వ్యవసాయానికి రూ.72 వేల కోట్లు కేటాయించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాడన్నారు. రైతు భరోసా నిధులు కూడా త్వరలో విడుదల అవుతాయని చెప్పారు. ఉగాది నుంచి రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం చైర్మన్ రమేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గోవింద్ నాయక్, ప్రశాంత్‌రెడ్డి, ఏడుపాయల మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మైనార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్, సందీప్, రమేశ్‌గౌడ్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బీజేపీ బూత్ కమిటీల ఎంపిక



కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని దేవులపల్లి, రాజిపేట గ్రామాల్లో బూత్ కమిటీలు ఎంపిక చేసినట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ బుధవారం తెలిపారు. దేవులపల్లి గ్రామ బూత్ అధ్యక్షుడిగా బోయిని కిష్టయ్య, కార్యదర్శిగా ప్రవీణ్, వాట్సాప్ ప్రముఖ్‌గా ఆంజనేయులు, మన్‌కీబాత్ ప్రముఖ్‌గా శివకుమార్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నట్లు చెప్పారు. దీంతో పాటు రాజిపేట గ్రామ బూత్ అధ్యక్షుడిగా నాగభూషణంతో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రాకేశ్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ ఫిజియోథెరపీపై అవగాహన

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని పాఠశాల హెచ్‌ఎంలకు ఫిజియోథెరపీపై బుధవారం నిమ్స్ ఫిజియోథెరపిస్ట్ సంతోష్ కుమార్ అవగాహన కల్పించారు. పాఠశాలలో మానసిక, శారీరక దివ్యాంగులపై అనుసరించాల్సిన విధానం, వారి ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ పుశ్పవేణి, సూరారం కాంప్లెక్స్ హెచ్‌ఎం సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల్లోని చెరువు, కుంటల్లో అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఇరిగేషన్ అధికారి రాజేశ్వర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామంలోని పెద్ద చెరువులో నుంచి గ్రామస్తులు పలువురు అక్రమంగా మట్టిని తరలిస్తున్న విషయాన్ని తెలుసుకున్న రాజేశ్వర్ ఘటన స్థలానికి వెళ్లి ట్రాక్టర్లను నిలిపివేశారు. అనుమతులు తీసుకున్న అనంతరం మట్టిని తరలించాలని ఆయన అన్నారు.

◆ ఆలయంలో హుండీ చోరీ

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చండి గ్రామంలో కొలువైన చండీకాంబ ఆలయంలోని హుండీని గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి ఆలయంలోకి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలోని మియ్యాడి అనిల్‌కు సంబంధించిన ఆటో పార్కింగ్ చేసి ఉంచగా, హుండీని చోరీ చేసి తీసుకెళ్తుండగా గ్రామానికి చెందిన గువ్వలబాబు రావడంతో ఆటోని హుండీని గ్రామ పంచాయతీ వద్ద వదిలేసి వెళ్లారు. చోరీ ప్రదేశాన్ని పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

◆ శివ్వంపేట ఎస్‌ఐగా మధుకర్‌రెడ్డి



శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట ఎస్‌ఐగా నియమితులైన మధుకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌ఐ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఏదైన సమస్యలుంటే నేరుగా వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. తగాదాలతో సమయం, డబ్బులు వృథా చేసుకోకుండా కలిసిమెలిసి ఉండాలని సూచించారు. మండలంలో ఎక్కడైన అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు.

◆ అనాథలకు చేయూత



శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని మగ్దుంపూర్ గ్రామంలోని అనాథ ఆశ్రమానికి ఏరీస్ పరిశ్రమ చేయూతనందించారు. బుధవారం ఏరీస్ పరిశ్రమ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అనాథ ఆశ్రమానికి నిత్యావసర సరుకులు, మానసిక దివ్యాంగులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరీస్ పరిశ్రమ మేనేజర్లు శివరామకృష్ణ, నగేశ్‌గుప్తా, రమేశ్, డీలర్లు నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, సంతోష్, మహేందర్, వెంకటేశం, తదితరులు ఉన్నారు.

◆ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తూప్రాన్: పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి లక్ష్మి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని రావెల్లిలో పశు వైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 ఆవులకు, 60 గేదెలకు పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ లక్ష్మి, సత్యనారాయణ, పశువైద్య సిబ్బంది, లింగమూర్తి, నాయకులు దుర్గారెడ్డి, రాజిరెడ్డి, అమరావతి, రామస్వామి, స్వామి, కృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ 1న వడ్డెర సంక్షేమ సంఘం చైతన్య సమావేశం

మెదక్ మున్సిపాలిటీ: డిసెంబర్ 1న జరిగే వడ్డెర సంక్షేమ సంఘం చైతన్య సమావేశానికి జిల్లాలోని వడ్డెరలు తరలివచ్చి విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు దుర్గసాయిలు పిలుపునిచ్చారు. బుధవారం రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జైపాల్‌ను కలిసి హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ఈ సమావేశానికి ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడు మారయ్య, మెదక్ జిల్లా వడ్డెర సంఘం నాయకులు తెలిపారు.

◆ ప్రజాపాలన కళాజాత

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ, దామరచెరువు, ప్రగతి ధర్మారం గ్రామాల్లో బుధవారం సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో సారథి టీం లీడర్ సిద్దులు, టీం సభ్యులు ఎల్లయ్య, విజయ, లక్ష్మి, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

◆ కేజీబీవీ వద్ద ఉపాధ్యాయుల నిరసన



నర్సాపూర్ రూరల్: మండలంలోని చిప్పల్‌తుర్తి కేజీబీవీ వద్ద బుధవారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండలాధ్యక్షుడు రవి మాట్లాడుతూ.. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా కేజీబీవీ ఉపాధ్యాయులు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్) అమలు చేసి, వేతనాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గంగాధర్, వసురం, కేజీబీవీ ప్రత్యేక అధికారి శ్వేత, ఉపాధ్యాయులు లత, విష్ణు తేజ, గీతాంజలి, జబీనా సుల్తానా, సుహాసిని, ప్రమీల, జ్యోతి, షమీం తదితరులు పాల్గొన్నారు.